అంతా మన మంచికే

"అమ్మాయిగారి పుట్టినరోజు గదూ! హార్టీకంగ్రాట్స్."

మహేష్ గ్రీటింగ్స్ ఓరకంటితో స్వీకరించింది మాలతి.

"అబ్బాయిగారు మెట్టినరోజుగదూ! శుభాభినందనలండోయ్!" చేటెడంత కళ్ళను చెవులదాకా తిప్పింది.

"అమ్మాయి పుట్టిందీ, మెట్టిందీ, ఈ అర్భకుణ్ని చేపట్టిందీ ఈరోజే కాబట్టి డబుల్...." మహేష్ మాట పూర్తికాకముందే మాలతి అరచెయ్యి అడ్డుపడి నోటికి తాళం వేసింది.

"నేను పుట్టిన రోజూ, మెట్టినరోజూ ఒకటే కావడం కాకతాళీయం. కాని, మీతో మూడు ముళ్ళు వేయించుకోవడంలోనే ఉంది విశేషమంతా" అంది శూన్యంలోకి చూస్తూ.

"నేన్నీ మెడలో మూడు ముళ్ళేసిన తక్షణమే నువు నా ముక్కుకు ముగదాడేసావుగదా!" అంటూ మాలతిని తనవైపుకు తిప్పుకున్నాడు.

మాలతీ మహేష్‌ల మొదటి పెళ్ళిరోజది.

మాలతి డిగ్రీ పాసైన తెలివి తేటలతో రెకమెండేషన్ రెక్కలు నరికి ప్రైవేట్ కంపెనీలో పాపులర్ ఉద్యోగం సంపాదించింది. తల్లి అప్పటికే "నాకు ఊరు దూరమౌతుంది, కాడు దగ్గరౌతుంది. మాలతీ!..." అంటూ ఎన్నో సార్లు హెచ్చరించింది. అందుక్కారణం ఊ అంటే, ఆ అనే ఆవిడ అనారోగ్యమే. ముగ్గురు పిల్లలకు జన్మనిచ్చి మాలతి తండ్రి అవతారం చాలించాడు. అప్పట్నుంచి రెక్కలు ముక్కలైనా లెఖ్ఖ చేయకుండా కూతురు చదువు సజావుగా కొనసాగేలా జాగ్రత్త

పడింది. కూతురు ఉద్యోగంలో చేరగానే లక్షలాస్తి చేతికొచ్చినట్టు సంబర పడిపోతూ -

"ఇహ నువ్వో ఇంటిదానివైతే చూడాలనుందే!" అనేసింది.

అబ్బా .... ఈ పెద్దవాళ్ళకిదే తొందర అనుకుని నవ్వూరుకుంది మాలతి.

చిటపట చినుకులు కుంభవృష్టిగా మారినట్టు పెళ్ళి ప్రస్తావన పోరుగా మారి చెవిలో ఇల్లు కట్టేసుకుంది.

"నేను పెళ్ళిచేసుకుని వెళ్ళిపోతే చెల్లీ, తమ్ముడి గతేం కానా లమ్మా?" సీరియస్‌గా అడిగింది మాలతి.

అందుకా పెద్ద ప్రాణం చిన్నగా నవ్వి -

"నిన్ను పెళ్ళి చేసుకొమ్మన్నానే గానీ, వెళ్ళి పొమ్మనలేదు గదా!" అనేసింది. తల్లి అంతరార్థం అర్థమైపోయింది. అంతే.... "పెళ్ళి చేసుకుని ఇల్లు వదలకుండా చల్లగా కాలం గడపా"లనే నిర్ణయం మాలతి బుగ్గలకు సిగ్గులు పూయించింది. వెంటనే పెళ్ళిళ్ళ పేరయ్య చిట్టాలో పేరు నమో దైంది.

మాలతి ఊఁ అంటే చాలు - పెళ్ళి చేసుకుని చేతిలో చెయ్యేసి చెట్ల నీడల్లో పరుగెత్తాలనుకున్న పెళ్ళికొడుకులు వరుసబట్టారు.

డబ్బూ, దస్కం దండిగా ఉన్న పెళ్ళికొడుకులు "అమ్మాయి నచ్చింది. పైసా కట్నం అక్కరలేదు. ముహూర్తాలు పెట్టించండి" అంటూ మెలికలు తిరిగారు.

కాని, అసలు సంగతి తెలియగానే -

"ఆడపిల్ల ఏనాటికైనా ఆడపిల్లే గదా? పెళ్ళైన ఆడపడచు అత్తా రింటికి చేరడమే ఆచారం గదా? అత్తామామలకు సేవలందించడం పవిత్ర కర్తవ్యం గదా?" అంటూ ముక్కులమీద వేళ్ళేసుకోబోయారు.

ఇల్లరికానికి సరేనన్న నిరుద్యోగులు చిరునవ్వులు ఒలకబోస్తూ -

"ఆవిడ జీతమూ, నా జీతమూ మా అమ్మా నాన్నలకే చెందాలి సుమా!" అని, ముందే కుండ బద్దలుకొట్టేశారు.

అరవిరిసిన మల్లెపూవు అరకాలుకిందపడినట్టు - మాలతి మనసు చివుక్కుమంది.

ఇదెక్కడి విచిత్రమో! అస్తమానం తమ పురుషాధిక్యతను చూపుతారే తప్ప 'అయ్యో పాపం!' అనరేమిటీ? పరిస్థితి నర్థం చేసుకోరెందుకో.... వీళ్ళసలు మనుషులేనా?.... పెళ్ళికొడుకుల్ని ఉతికి ఆరెయ్యాలనిపించింది మాలతికి.

"మరి మా అమ్మా, తమ్ముడూ, చెల్లీ ఏట్లో దూకాలా?" సూటిగా ప్రశ్నించిందో పెళ్ళికొడుకును, ఎగదోసుకొస్తున్న రోషాన్నాపుకుని.

"ఏమో, అదంతా నాకెందుకూ? త్యాగానికైనా హద్దుంటుంది. కులం చెడినా సుఖం దక్కాలిగదా! కట్నం రాకుంటే మానె, నీ జీతమన్నా చేతికి రాకపోతే రెంటికి చెడిన రేవడినైపోనా?" ప్రశ్నకు ప్రశ్నే సమాధానమైంది.

కట్నం, కట్నం, కట్నం.... అసలీ దురాచారాలకంతేలేదా? ఒక రూపంలో కాకపోతె మరో రూపంలోనా? సంసారమనే బండికి భార్యాభర్తలు రెండు చక్రాలు గదా! ఐనప్పుడు భార్యే కట్నం తేవాలనడం అమానుషం.... మాలతి రోషం బ్రహ్మపుత్రానదిలా గంతులేసింది.

"జన్మనిచ్చిన తల్లి ఋణం తీర్చుకోవద్దా?" పొంగుకొస్తున్న ఆవేశానికి సంయమనం ఆనకట్ట వేసింది.

"అది మగవాడి బాధ్యత."

"సంతానమంటే మగవాడేనా?" ముక్కుపుటాలెగిసిపడ్డాయి. మూడు రాళ్ళ ముక్కుపుడక ఘాడు రంగుల్లో మెరిసింది.

"అమ్మో!.... గాలికి పోయే కంపను కాలికి తగిలించుకున్నట్టు.... మాకెందుకూ?" చల్లగా జారుకున్నాడు.

కన్నతల్లి కడుపు కడలి పర్యంతమైంది. మళ్ళీ పెళ్ళి ప్రసక్తి తెస్తే మాలతి అగ్నిపర్వతమైపోతుందేమోననే భయమేసింది.

ఇలా రెండు సంవత్సరాలు గడిచాయి.

ఆరోజు....అలసిపోయిన మాలతి ఆఫీసునుండి వస్తుంది. నడిరోడ్డు మీద దారిలో పడున్న యువకుడిని చూసింది. మాసిన గుడ్డలు, చెదరిన గడ్డం....లోతుకుపోయిన కళ్ళు సగం మూసున్నాయి. చుట్టూ కాకుల్లా చుట్టేశారు జనాలు.

"ఎవడో తప్పతాగినట్టుంది."

"రోడ్డుమీద పడుకుంటానని ఏ దేవునికి మొక్కుకున్నాడో...."

"రోడ్డుమీద పడకసీను ప్యాషనైపోయింది."

ఎవరిష్టమొచ్చినట్టు వాళ్ళు మాట్లాడ్తూ, తప్పుకుంటున్నారు.

మాలతి జాలిగుండె మైనంలా కరిగింది.

పోయే జనాల నాపి "సాటి మనిషికాస్త సాయం చెయ్యండి — ప్లీజ్!" బతిమాలింది.

వింతగా చూశారంతా.

"ఆయన మీకేమవుతాడూ?" అడిగా డొకాయన.

"నాకేమీ కాడు, కాని....ఓ నిండు ప్రాణం....అలా...."

"పో....పోవమ్మా! తిని ఊరుకుండక...." మందలించి ముందుకు సాగాడు ఓ యువకుడు.

"అలాగంటే ఎలా .... ప్లీజ్, మీరన్నా!" మరో యువకుడి కళ్ళ లోకి చూచింది.

"ఆయన చచ్చూరుకుంటే కోర్టుచుట్టూ మనం ప్రదక్షణలు చెయ్యాలి. మన కెందుకీ గొడవా?" ఓర చూపు విసిరాడు.

"రేపు మనం గూడా ఇలాగే పడిపోతే మన గతీ ఇంతేకదా?" మాలతి మొహం ఎర్రబారింది.

"మన విషయమా! రేపటిదాకా ఎందుకూ? ఇప్పుడే పార్కులో పడిపోదాం పదా!'' భుజమ్మీద చెయ్యేశాడు. తేళ్లూ జెర్రులు పాకినట్టైంది మాలతికి.

"ఛీ....!" చెంప చెళ్ళుమంది.

పక్కనున్న కిళ్ళీ షాపులోంచి తానే సోడా కొట్టించుకొచ్చి పడున్న యువకుని మొహమ్మీద చల్లింది. మరో సోడా నోటికందించింది. గటగటా తాగేసి మెల్లిగ లేచి కూచున్నాడతడు.

"మీరెటు వెళ్ళాలండీ?" అడిగింది.

జవాబు రాలేదు.

"చెప్పండీ.... మీ ఇల్లెక్కడా?'

"...." మళ్ళీ జవాబు రాలేదు. చుట్టూ మూగిన జనాలు ఆసక్తిగా చూస్తున్నారు.

"అబ్బా.... చెప్పండీ, మీ ఆల్లెక్కడా?" మాలతి గొంతులో ఆవేదన, ఆందోళన.

"మా ఇల్లా....!" మాట నూతిలోంచి వచ్చినట్టుంది.

"ఔను...."

బుర్ర గోక్కుంటూ తల పైకెత్తాడు. మాలతినీ జనాలనూ వరుసగా చూస్తున్నాడు.

గాలికి చెల్లాచెదరైన ఎండుగడ్డిలా జట్టు. పాలిపోయిన మొహం. "ప్చ్...." పెదాలు చప్పరించి నేలమీది కొరిగాడు.

ఆటోరిక్షాలో ఇంటికి తెచ్చింది. అన్నం ప్లేటు ముందుంచగానే అతని కళ్ళు కాంతి పుంజాలైనాయి. మాలతి గుండెల్లోంచి తోసుకొచ్చిన నిట్టూర్పు పెదాలమీద నవ్వుగా మెరిసింది.

మాలతిని చాటుకు తీసికెళ్ళింది తల్లి.

"ఇదేం చోద్యమే మాలా?" బుగ్గలు నొక్కుకుంది.

"పాపం, రోడ్డుమీద పడుకున్నాడమ్మా!''

"రోడ్డుమీద పడుకున్న వాళ్ళందర్నీ కొంపకు తేవాలా? వయసులో ఉన్నదానివి. ముక్కూ మొహం తెలీనివాణ్ణింటికి తెస్తే లోకమేమనుకుంటుందో తెల్సా?"

మాలతి కిమ్మనలేదు.

కుదుటపడ్డాక చెప్పాడతడు:

"నా పేరు మహేష్. చిన్నప్పుడే తల్లిదండ్రులు పోయారు. పల్లెటూర్లో బంధువులింట్లో పెరిగాను. వాళ్ళ ఆస్తి గొడవల్లో నన్ను బయటికి గెంటారు. పొట్ట చేతపట్టుకుని పట్నం చేరాను. అరికాళ్ళు అరిగేట్టు తిరిగినా ఉద్యోగం దొరకలేదు. మూడ్రోజులనుండి తిండిలేదు. దేవతలా మీరాదుకున్నారు." చేతులు జోడించాడు.

ఏనాటి అనుబంధమో.... ఆత్మీయుడిలా కనిపించిన మహేష్‌కు తన పరిస్థితి అంతా చెప్పేసింది.

మాలతి కళ్ళకు తోడుగా మహేష్ కళ్ళు గూడా చెమ్మగిల్లినై.

"మీరంగీకరిస్తే మీ జీవిత భాగస్వామి నౌతాను. కట్నం అవసరం లేదు. మీవద్దే ఉంటాను. ఇది నా అదృష్టంగా భావిస్తాను" అన్నాడు.

వారం రోజుల్లో అతని కర్ధాంగైపోయింది. వెంటనే కిళ్ళీకొట్టు పెట్టించింది.

"ఏయ్ మాలతీ! మాలతీ లతా!" మహేష్ పిలుపు మాలతి నీలోకంలోకి తేలేదు. ఇంకా శూన్యంలోకే చూస్తుంది.

"అలా చూసేబదులు కబుర్లేమన్నా చెప్పరాదా?" చెవిలో గట్టిగా అన్నాడు.

ఉలిక్కిపడింది. ఆ తర్వాత చిలిపిగా నవ్వింది.

"కబుర్లకేంగానీ....నాదో కోరికండీ!" బుంగమూతి పెట్టింది.

"విషయం ఏమిటంటా!"

"ఏమిటంటే ....ఏ....మి....టం....టే...." మనసులోవి మాట పెదాలదాకా వచ్చి ఆగిపోతుంది.

"అబ్బా....మళ్ళీ కొత్త పెళ్ళికూతురువై పోతున్నావా?" అన్నాడు మహేష్.

"మీ ముందు కలకాలం పెళ్ళికూతుర్నే" అందామనిపించింది. కాని కర్తవ్యం గుర్తుకొచ్చి లేచికూచుంది.

"మా చెల్లీ తమ్ముళ్ళను చూస్తే మీకేమనిపిస్తుంచీ?"

మాలతి కొత్తగా మాట్లాడ్తుందేమిటీ? వాళ్ళను నేనేమన్నాననీ! నా మీద లేనిపోని కొండాలేమన్నా చెప్పారేమో! నిర్మలాకాశంలో నీలి మేఘంలా నిరుత్సాహం ఆవహించింది.

"చెప్పండి.... ప్లీజ్...." కళ్ళలోకి సూటిగా చూచింది.

"వాళ్ళను నా చెల్లీ తమ్ముడుగా భావిస్తున్నాను మాలతీ!" అంటూంటే అతని మొహం ఎండకు వాడిన ఆకులాగైంది. మాలతి మనసు తేనెతాగిన గండు తుమ్మెదలాగైంది.

"నాకు మాత్రం వాళ్ళు మన పిల్లలేననిపిస్తుందండీ!" అతని గుండెల మీద ఒదిగిపోయింది.

"నిజమే మాలతీ! వాళ్ళను చదివించి ప్రయోజకుల్ని చేసే బాధ్యత మన మీదుంది సుమా!" అన్నాడు మహేష్.

"కాని.... మనకూ పిల్లలు పుడితే.... మనల్ని స్వార్థం పురుగులా తొలిచేస్తుంది. అప్పుడు వాళ్ళను పట్టించుకోకపోవచ్చు. తలుచుకుంటే నాకు భయమేస్తుందండీ!" గుండెమీద చెయ్యేసుకుంది.

"ఐతే.... మరేం చేద్దామంటావు?"

"నేను ట్యూబెక్టమీ ఆపరేషన్ చేయించుకుంటాను.... ప్లీజ్!"

''అది అప్పటిమాట." దిండుమీది కొరిగాడు.

మాలతిని అనుమానం విషవాయులా చుట్టేసింది.

''ఐతే మీ మాటలు ఆపద మొక్కులు, సంపద తీర్పులా?" అడిగింది. "మరిప్పుడేమంటున్నారు?" నిలదీసింది.

''నాకు నా అనేవాళ్లు నలుగురున్నారు మాలతీ!" అంటూ నవ్వబోయాడు.

''ఛీ.... మీరు మొగుడిలా కాదు, మృగంలా కనబడుతున్నారు." ధుమధుమలాడింది.

మగమహారాజుకు రోషం పొడుచుకొచ్చింది.

''ఏం.... ఎందుకూ?'' దిగ్గున లేచి కూచున్నాడు.

''అప్పుడేమో ఎవరూ లేరన్నారు. ఇప్పుడేమో నలుగురున్నారంటున్నారు. రేపేమంటారో!'' అసహనం కుతకుతలాడింది.

''ఔను. అప్పుడెవ్వరూ లేరు. ఇప్పుడు నా భార్యా, ఆవిడతో మరో ముగ్గురున్నారంటున్నాను. ఆ నలుగురూ నావాళ్లు కాదా?'' లేచి నిలబడ్డాడు.

విభ్రమంగా చూచిందతణ్ణి. కఠోర తపస్సు ఫలితంగా దేవత ప్రత్యక్షమైనట్టనిపించింది. కోపం కొండెక్కి పోయింది.

"మీరెందుకు నా కోరిక చెల్లించరూ?" గారాబంగా అడిగింది.

"అసలు నీ కోరికేమిటీ? మీ చెల్లెలూ తమ్ముడూ మనకు దేవుడిచ్చిన పిల్లలు, మనకింకా పిల్లలెందుకనేగా?"

"ఔనండీ. సెంట్ పర్సెంట్ అంతే." కళ్ళు జిగేల్‌మన్నై.

"ఐతే, నీ కోరిక నేనెప్పుడో చెల్లించేశాను"

"అదెలా?" ఆసక్తిగా అడిగింది.

"పల్లెటూరు నుండి ఈ పట్నం రాగానే ఉద్యోగాల వేట ప్రారంభించాను. వేట ఆకలి మంటల్ని రేపింది. జేబులో చిల్లిగవ్వ లేదు. ప్రభుత్వాసుపత్రి ముందు కుటుంబ సంక్షేమ వారోత్సవాల బానర్ కన్పించింది. లోపలికెళ్ళాను. ఇద్దరు పిల్లలున్నారని అబద్ధం చెప్పి వేసక్టమీ ఆపరేషన్ చేయించుకున్నాను. వాళ్ళిచ్చిన పారితోషికం డబ్బుతో వారంరోజులు గడిపాను. తర్వాత కథ మళ్ళీ మొదటికొచ్చింది. మూడ్రోజుల ఉపవాస దీక్ష తర్వాత నడిరోడ్డుమీద నీ కంటపడ్డాను."

మాలతి మొహం హారతికర్పూర దీపంలా వెలిగిపోయింది. కళ్ళు మిలమిలలాడాయి. మహేష్‌లో మాధవుడు కన్పించాడు.

"అంతా మనమంచికే జరిగిందండీ! పాపిష్టిదాన్ని, మిమ్మల్ని అనుమానించాను." లెంపలేసుకుంది. మహేష్ అంతరంగం పున్నమినాటి సముద్రంలా పొంగింది.

(ఆకాశవాణి - హైదరాబాదు, 6-12-94)